


**"బాబూ... నిజంగా కరెంటు లైటు ఏత్తారంటారా?"**

**కౌన్సిలర్ శివరాజు చిరాగ్గా చూశాడు.**

**"ఏస్తారని ఎన్ని సార్లు చెప్పాల్రా ఎదవ నాకొడకా - గంటనుంచీ సంపేత్తన్నావ్" అన్నాడు శివరాజు.**

"సెమించండి బాబూ - తెలీకడిగా" రెండు చేతులూ జోడించి అన్నాడు సత్తెయ్య.

శివరాజు ఆ మురికివాడలో మిగతా వాళ్లతో మాట్లాడుతూ వారు చెప్పే సమస్యలన్నిటినీ ఆసక్తిగా వింటున్నట్టు నటిస్తున్నాడు.

వారం రోజుల క్రితం ఆ మురికి వాడలో కరెంటు లైట్లు వేయటానికి నాలుగు స్తంభాలు పాతారు. ఇంతవరకూ కిరోసిన్ దీపాలతో కాలం వెళ్లబుచ్చుతున్న ఆ మురికి వాడ ప్రజలు తమ గుడిసెల్లోనే కరెంటు లైట్లు వెలుగుతాయన్నంత సంబర పడ్డారు.

సత్తెయ్య శివరాజును చూశాడు. అందరికీ చెప్పి కారెక్కబోతుండగా సత్తెయ్య హడావుడిగా వచ్చాడు. శివరాజును అడిగే ధైర్యంలేక ప్రక్కనే ఉన్న అతని అనుచరుడిని అడిగాడు.

"బాబూ! నిజంగా లైటేత్తారా?"

"రేయ్ సత్తిగా... సంపేత్తాను జాగర్త. ఏందిరా - సాక్షాత్తూ ఎమ్మెల్లే గారు స్తంభాలు నాటించినా ఇంకా నీకు అనుమానం తీరలేదా? ఎదవని ఎదవ" అన్నాడతను.

అంతే సత్తెయ్య వేగంగా గుడిసె దగ్గరకెళ్లాడు. గుడిసె బయట కుక్కి మంచంలో పడుకున్న డెబ్బై ఏళ్ల తల్లిని చూసి - "అమ్మోయ్... కరెంటు లైటు నిజంగానే ఏత్తారంటనే" అని కేక వేశాడు.

ముసల్దాని కళ్లు మెరిశాయి.

"నిజంగా ఏత్తారంటావా?" అంది.

"అవునే... నిజంగా ఏస్తారంట. కౌన్సిలర్ బాబు సెప్పాడు" అన్నాడు ఆనందంగా.

ముసల్ది ఆనందంగా తన గుడిసె ఎదురుగా ఉన్న కరెంటు స్తంభాన్ని చూసింది. దానికి గనుక లైటు వేస్తే ఆ వెలుగు తన గుడిసెలోకి కూడా వస్తుంది. గుడిసె ముందంతా వెలుగే... వెన్నెల్లాంటి వెలుగు.

తృప్తిగా నవ్వుకుంది ముసల్ది.

ఎక్కడో మారుమూల పల్లెటూళ్లో పుట్టి పెరిగిన ముసల్దానికి - ఎప్పట్నుంచో కోరిక... కరెంటున్న ఇంట్లో ఉండాలని... పెళ్లయింది. అయినా గుడిసెలోనే కాపురం. సత్తెయ్య పుట్టాడు - పెరిగాడు - బస్తీ వెళ్లి ఏదో ఒక పని చేసి డబ్బులు సంపాయిస్తానని చెప్పి వెళ్లాడు. అక్కడే పెళ్లి చేసుకున్నాడు. తండ్రి చనిపోవటంతో తల్లిని తన దగ్గరకు తెచ్చుకున్నాడు. ముసల్దానికి అప్పుడు అర్థమైంది కొడుకు చేస్తున్న ఉద్యోగం ఏంటో...

ఉదయం నుంచీ సాయంత్రం దాకా నరాలు తెగేలా రిక్షా లాగటం! కనీసం కొడుకు దగ్గరైనా తన కోరిక తీరుతుందనుకుంది. అదీ తీరలేదు. ఆ వాడలో ఒక్క కరెంటు లైటు కూడా లేదు.

మురికి కాలవలు... పందులు... కుక్కలతో నిత్య సహచర్యంలో క్రమంగా ఆ వాతావరణానికి అలవాటు పడింది ముసల్ది.

ఇన్నేళ్లకు తన కోరిక తీరబోతోంది.

గుడిసెలో లేకపోతేనేం... ఆ లైటు వెలుగు గుడిసెలోకి వస్తుందని అంతా అన్నారు. తన అదృష్టానికి పొంగి పోయింది. ఇక గుడిసెలో కిరసనాయిలు దీపం అవసరం ఉండదు. వంట చేసుకోవడం కూడా గుడిసె ముందే గనుక కరెంటు లైటులోనే...!

అన్నిటికీ మించి అన్నం తినేటప్పుడు.. హాయిగా ఇక్కడే ఈ మంచం మీద వెన్నెల్లాంటి వెలుగులో మహారాణిలా అన్నం తినేయొచ్చు.

"దేవుడూ... ఇన్నేళ్ల తర్వాత ఈ వయస్సులో నా కోరిక తీర్చుతున్నావా నాయినా..." రెండు చేతులూ జోడించి అనుకుంది.

ఆ మర్నాడు...

ఉదయం పదకొండు గంటలకు ఎలక్ట్రిసిటీ వాళ్లొచ్చి ట్యూబ్ లైట్లు బిగించారు. ఈ రాత్రి నుంచి లైట్లు వెలుగుతాయని చెప్పారు. జనం ఆనందానికి హద్దుల్లేవు. ఎలక్ట్రిసిటీ వాళ్లు, కౌన్సిలర్ బాబు - ఎమ్మెల్లే గారూ అంతా సాక్షాత్తూ దేవుళ్లలా కనిపించారు వారికి.

"ఏయ్ ముసల్దానా... అదురుష్టం అంటే నీదేనే - ఈ వాడలో ఎవ్వరికీ గుడిసె ముందు లైటు

లేదు. ఏం పున్నెం సేసుకున్నావో..." సినిమాహాలు ముందు వేరు శెనగ కాయలు అమ్మే రాములు ముసల్దానితో అన్నాడు.

ముసల్ది గర్వంగా చూసింది.

ఎప్పుడో మర్చిపోయిన నవ్వు - ఆమె పెదవుల మీద వెలిగింది. ముసిముసిగా నవ్వుతూ అంది. "పోన్లేరా... అంతా ఆ దేముడి దయ. ఏదో ఆ లైటు ఎల్తురులోనే నా ఊపిరి పోతే - అంతకన్నా ఏం కావాలె? పుట్టటం సీకట్లోనే... బతుకంతా సీకటే... కనీసం కన్ను మూసేటప్పుడైన ఎలుగొచ్చింది అది సాలదు."

మురికి వాడంతా రాత్రి కోసం ఎదురు చూస్తున్నారు.పిల్లలయితే కరెంటు స్తంభాల చుట్టూ గుమిగూడి తెల్లగా మెరిసిపోతున్న ట్యూబ్‌లైటును చూస్తున్నారు.

"రేయ్ ఎదవ నాయాల్లారా... ఇక నుంచి రాళ్లతో ఆటలాడారంటే సంపేత్తా... రాయి లైటుకు తగిల్తే... పగిలిపోద్ది... ఎవుడి సేతిలోనన్నా రాయి కనిపిత్తే బుర్ర పగల గొడతా జాగర్త". సత్తయ్య భార్య లక్ష్మమ్మ పిల్లల్ని హెచ్చరించింది.

"ఇంకెప్పుడత్తా?" ఒకడడిగాడు.

లక్ష్మమ్మ గర్వంగా లైటు వేపూ, సూర్యుడి వేపూ చూసి - "అప్పుడే ఎట్టా ఎలుగుద్ది? సీకటి పడాల... ఎల్లుండెల్లుండి... మరీ అట్టా ఎదవ సూపులు సూడమాకండి దిట్టి తగులుద్ది" అంది.

అయినా పిల్లలు స్తంభాన్ని వదల్లేదు."రేయ్ సెప్పేది మీక్కాదూ - ఓ లచ్చమ్మోయ్ ఆ ఎదవలు లైటు నేమయినా సేత్తారేమోనే - ఎల్లగొట్టు" భయంగా అంది ముసల్ది.

లక్ష్మమ్మ బయటికొచ్చి అందర్నీ కసిరి పంపించి వేసింది. పిల్లలు మరో స్తంభం దగ్గరకు పోయి పైకి చూడసాగారు.

"ఏమైందీ రోజు... ఇట్టే సీకటి పడిపోయేది... ఇయ్యాలేందో ఇంత ఆలీస్సెం..." విసుక్కుంది ముసల్ది.

మంచం మీద నుంచి లేచి వణుకుతూ... నెమ్మదిగా కరెంటు స్తంభం దగ్గర కెళ్లి భక్తితో తాకింది.

ఆ తర్వాత రెండు చేతులూ జోడించి కళ్లు మూసుకుంది. "దేవుడా... నా పేనం ఎప్పుడు తీసుకెల్తావో నాకు తెల్దు. ఈ ఎలుగులోనే పోయేటట్టు సేయి నాయినా. అంతకన్నా ఇంకేం కోరుకోను దేవుడా...ఈ ముసల్దాని కోరిక తీర్చు... సాలు..."

రాత్రి ఎనిమిదయింది.

వాడలో అందరూ ఆ రోజు ఏడు గంటలకే ఇళ్లకొచ్చేశారు. రాములు అసలు సినిమా హాలుకే వెళ్లలేదు.

అంతా స్తంభానికున్న లైట్‌నే రెప్పవేయకుండా చూస్తున్నారు.

"కొత్తకదన్నా - ఈరోజు ఆలిస్సెంగా ఎలుగుతాయేమో" అన్నాడు సత్తయ్య.

ముసల్ది అప్పటి వరకూ కూర్చుని లైటుని చూసి - ఓపిక లేక పడుకుని తదేకంగా లైటు వేపే చూడసాగింది.

"ఏందిరా సత్తిగా - ఇంకా ఎలగలేదే?" అని అడిగాడు నర్సయ్య.

"ఉండవే నీయవ్వ కరెంటు లైటా మజాకనా - గుడిసెలో దీపం పెట్టినట్టు కాదే - తొందర పడతావేం!" కసిరాడు సత్తెయ్య.

తొమ్మిదైంది. లైట్లు వెలగలేదు.

"ఈరోజు ఎలగవు లేరా - రేపట్నుంచి ఎలుగుతాయేమో" అన్నాడు రాములు.

సత్తెయ్య మాట్లాడలేదు.

"అత్తోయ్ - లైటు ఎలిగితే - లైటు ఎలుగులో కూడు తింటానని ఇప్పటి దాకా సూశావ్. లే... ఇక ఈ రోజుకింతే అయ్యి ఎలగవు - లే... కూడు తిను" అంది లక్ష్మమ్మ.

"నే తినను... లైటు వొత్తదే.. పది గంటలకైనా వొత్తది. ఆ ఎలుగులోనే తింటా - కావాలంటే మీరు తినండి" అంది ముసల్ది.

లక్ష్మమ్మ చిరాగ్గా గుడిసెలో కెళ్లిపోయింది.

పదయింది. లైట్లు వెలగలేదు. వాడలోని జనమంతా ఇక వెలగవని నిర్ణయించుకుని గుడిసెల్లోకి వెళ్లి పోయారు.

ముసల్దానికి ఇంకా ఆశ చావలేదు. అలాగే లైటు వేపు చూస్తూ పడుకుంది. సత్తెయ్య, లక్ష్మమ్మ ఇద్దరూ కూడు తిని గుడిసె లోపల పడుకున్నారు. ముసల్ది తినలేదు. ఆకలి అనిపించలేదు. అందుకే లైటు వేపే చూడసాగింది. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. గాలి నెమ్మదిగా వీస్తోంది.

పందిని తరుముకుంటూ కుక్కలు పరుగెత్తాయి.

పదకొండు గంటలయింది.

ముసల్ది ఏడుస్తోంది. ఆమెకు నిద్ర రావటం లేదు. కరెంటు స్తంభం వేసినప్పట్నుంచీ తీరని కోరిక ఈ రోజు తీర బోతుందని ఎంత ఉత్సాహ పడింది?

ముసల్దానికి తన బాల్యం గుర్తొచ్చింది.

అప్పు డసలు కరెంటు లైట్లు ఎక్కడా లేవు... ఆ తర్వాత చాలాకాలం తర్వాత ఆ ఊరి జమీందారు గారింటికి కరెంటు వేశారని తెలిసి... ఊళ్లో జనమంతా తిరునాళ్లలా వెళ్లి దూరం నుంచే వెలుగుతున్న లైట్లను ఆశ్చర్యంగా చూడసాగారు. అప్పట్నుంచీ తను కరెంటు లైటున్న ఇంట్లో ఉండాలన్న కోరిక బలంగా నాటుకు పోయింది. బ్రతుకు సమరంలో ఎన్నో ఎదురు తెన్నులు తిన్నా - ఆ కోరిక మాత్రం చావలేదు.

ఇన్నేళ్ళకు తీరుతుందనుకున్న చిన్న కోరిక - చివరికిలా...

ఉదయం ఆరుగంటలకు గుడిసె బయట కొచ్చిన లక్ష్మమ్మ ముసల్దాన్ని చూసి ఘొల్లుమంది.

కంగారుగా బయటకొచ్చిన సత్తెయ్య తల్లిని చూశాడు. ఆమెకళ్ళు తదేకంగా లైటునే చూస్తున్నాయి..... కానీ వాటిలో జీవం లేదు.

తెరచి ఉంచిన నోటి బయట ఈగలు ముసురుతున్నాయి "అమ్మా - ఎల్లిపోయావంటే ..."తల్లి శవం మీద పడి ఏడుస్తున్నాడు సత్తెయ్య.

అప్పటికే ఈ వార్త తెలిసిన వాడలో జనమంతా అక్కడచేరారు.

ముసల్ది చచ్చిపోయి - ఈ రోజుకి పది రోజులు....అయినా లైటు వెలగలేదు. ●

